సాక్షి
అనంతపురం
మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



పాడి రైతులకు మంచి రోజులు

పాడి రైతులకు దన్నుగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. 8లో



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.7°/ 15.9°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

సింహ వాహనంపై శ్రీవారి రాజసం



బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో కొండమీదరాయుని బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కొండమీద రాయుడు సింహ వాహనంపై భక్తులను కటాక్షించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పుర వీధుల్లో మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఊరేగింపు చేపట్టారు. మహిళలు శ్రీవారికి మంగళ హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మంగళవారం శ్రీవారికి శేష వాహన సేవ ఉంటుందని అర్చకులు తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణకు ఆర్‌ఓలు

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులకు (ఆర్‌ఓ) ఎన్నికల కమిషన్ 5 రోజుల శిక్షణ ఇస్తోంది. సోమవారం నుంచి ఈ నెల 23 వరకూ తిరుపతిలో కార్యక్రమం జరగనుంది. ఉరవకొండ నియోజకవర్గ ఆర్‌ఓగా ఉన్న జేసీ కేతన్‌గార్గ్, అనంతపురం ఆర్‌ఓగా ఉన్న ఆర్‌డీఓ గ్రంధి వెంకటేష్, కళ్యాణదుర్గం ఆర్‌ఓగా ఉన్న ఆర్‌డీఓ రాణి సుస్మిత, రాప్తాడు ఆర్‌డీఓగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు శిక్షణ పొందేందుకు సోమవారం బయలుదేరి వెళ్లారు. జిల్లాలో 8 నియోజకవర్గాలు ఉండగా రాయదుర్గం, గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గ ఆర్‌ఓలకు ఇప్పటికే శిక్షణ పూర్తైంది.

ఎస్కేయూకు 'ఉష'స్సు

- 'పీఎం ఉష' కింద రూ. 20 కోట్లు మంజూరు



వివరాలు తెలియజేస్తున్న వీసీ హుస్సేన్ రెడ్డి, చిత్రంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి పీఎం ఉష (గతంలో రూసా – రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్షా అభియాన్) పథకం కింద రూ.20 కోట్ల నిధులు మంజూరైనట్లు వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలకు రూపకల్పన చేసి సోమవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఎం నరేంద్ర మోదీ మంగళవారం (నేడు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'పీఎం ఉష' పథకం కింద లబ్ధి పొందుతున్న వర్సిటీల వీసీలతో సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, పీఎం ఉష ప్రోగ్రాం ఎస్కేయూ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ నాగరాజు, ప్రొఫెసర్ వి.రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసత్య కథనాలు వ్యాప్తి చేయొద్దు



అనంతపురం: సామాజిక మాధ్యమాల్లో అసత్య కథనాలు వ్యాప్తి చేసి ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించవద్దని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంతల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ఎద్దులను తరలిస్తున్న వాహనం చెడిపోవడంతో అనంతపురం సమీపంలోని పామురాయి పొలాల్లో వాటిని దింపి మేత పెట్టారన్నారు. అయితే, కొంతమంది పశువులను అక్రమంగా తరలిస్తున్నారంటూ వాట్సాప్ గ్రూపుల్లో వ్యాప్తి చేశారన్నారు. అవాస్తవ పోస్టులు పెడుతూ ప్రజల్ని అయోమయంలోకి నెట్టడం సరికాదన్నారు. ఈ తరహా పోస్టింగ్‌లు పెట్టే వారు ఒకసారి ఆలోచించుకోవాలని హితవు పలికారు. ఇటీవల ఒరిస్సా నుంచి బెంగళూరు, కేరళకు పశువులను తరలిస్తున్న కంటైనర్ జిల్లాలోని కాశేపల్లి టోల్‌గేట్ సమీపంలో బోల్తా పడిన ఘటనపై తాడిపత్రి డీఎస్పీ దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

జన కెరటం.. నవ చరితం

- 'సిద్ధం' సక్సెస్.. ఫుల్ జోష్
- రాష్ట్ర చరిత్రలో నిలిచేలా రాప్తాడు సభ
- అన్ని వర్గాల్లోనూ చర్చ
- సామాజిక మాధ్యమాల్లో సీఎం జగన్ పంచుల ట్రెండింగ్
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఓ రాజకీయ పార్టీ నిర్వహించిన సభకు ఆ పార్టీ శ్రేణులే కాదు జనం కూడా పోటెత్తారు. తమ అభిమాన నాయకుడిని చూసేందుకు కెరటంలా తరలివచ్చారు. భగభగ మండే భానుడి ప్రభావం సైతం వారి ముందు చిన్నబోయింది. ఈ నెల 18న రాప్తాడులో కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన 'సిద్ధం' సభ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.





ఈ నెల 18న రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభకు హాజరైన జనవాహిని

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకూ జరగని అతి పెద్ద ప్రజాసభకు వేదికై అనంతపురం జిల్లా తనకంటూ చరిత్రలో ఓ పేజీ లిఖించుకుంది. గతంలో ఎందరో మహామహులు సభలు నిర్వహించినా ఇంత పెద్ద ఎత్తున జనం తరలివచ్చిన సందర్భాలు లేవు. భవిష్యత్తులో ఇంత కంటే పెద్ద సభ జరగడం కూడా కష్టమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది సభకు హాజరవడం ఆశ్చర్యపరిచిందంటున్నారు. ఇసుకేస్తే రాలనంత జనవాహినితో జిల్లాలో ఉన్న రహదారులన్నీ ఒక్కసారిగా ఊపిరి బిగపట్టినంత పనయిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏ నాయకుడికీ లేని జనాదరణ జగన్‌మోహన్‌రెడ్డికి ఉందని తెలుసు గానీ, ఆయనను చూసేందుకు, ప్రసంగం వినేందుకు ఈ స్థాయిలో ప్రజలు హాజరవడం ఊహించలేదంటున్నారు. రాప్తాడు 'సిద్ధం' సృష్టించిన రికార్డు చెరిగిపోని, మాసిపోనిదని వ్యాఖ్యానిస్తున్నారు.

సీఎం పంచుల హల్‌చల్

సార్వత్రిక సమరానికి తెరతీసి ప్రతిపక్షాలకు వణుకు పుట్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదివారం రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనపై పంచులతో హోరెత్తించారు. సభలో తనదైన శైలిలో సీఎం చేసిన ప్రసంగం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. అంతేకాకుండా సభకు వచ్చిన జనం కేరింతలు అయా మాధ్యమాల్లో కెరటాల్లా ఎగిసిపడుతున్నాయి. లక్షల మంది వీటిని వీక్షించారు. ఇతరులకు షేర్ చేశారు. మహిళలు, వృద్ధులు జెండా పట్టుకుని ఉత్సాహంగా డ్యాన్సులు చేసిన సన్నివేశాలు విపరీతంగా ఆకట్టుకున్నాయి. ప్రతిపక్షాలపై ముఖ్యమంత్రి జగన్ పేల్చిన పంచులను నెటిజన్లు పదే పదే వైరల్ చేస్తున్నారు. ముఖ్యంగా 'ఫ్యాన్ ఇంట్లో ఉండాలి.. సైకిల్ బయట ఉండాలి..టీ గ్లాసు సింకులోనే ఉండాలి' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఏ మాధ్యమం చూసినా వినిపిస్తున్నాయి.

ప్రతిపక్షాల్లో మరింత భయం..

అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్ ప్రతి ఇంటి తలుపు తట్టారు. అవ్వతాతలకిచ్చే పెన్షన్ నగదు పెంచడమే కాకుండా ఇంటి వద్దకే అందించేలా ఏర్పాట్లు చేసి దీవెనలందుకున్నారు. రైతు భరోసాతో అన్నదాతకు చేయూతనందించారు. డ్వాక్రా రుణమాఫీతో అక్కచెల్లెమ్మలకు ఆనందం పంచారు. ఒకరేమిటి సంక్షేమాభివృద్ధి రథాన్ని పరుగులు పెట్టించి అన్ని వర్గాలకూ చేరువై ప్రతిపక్షాల ఉనికినే ప్రశ్నార్థకం చేశారు. ఎన్నికల కదనరంగంలోనూ దూసుకెళ్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఈ క్రమంలోనే 'రాప్తాడు'లో నిర్వహించిన సభ సూపర్ సక్సెస్ కావడం ప్రతిపక్షాలను మరింత రక్షణాత్మక ధోరణిలోకి నెట్టేసినట్లయింది.

కేడర్‌లో సమరోత్సాహం

రాప్తాడు సభ విజయవంతంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఫుల్ జోష్ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు, నాయకుల్లో సమరోత్సాహం కనిపిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అయితే కార్యకర్తల ఆనందానికి అవధుల్లేవు. తమ అభిమాన నాయకుడు రావడం, అశేష జనవాహిని సముద్రంలా ఉప్పొంగడం, దీనికి తమ జిల్లా వేదిక కావడం.. ఇంతకంటే కావాల్సిందేముంటుంది అని చెప్పుకుంటున్నారు. లక్షలాది మంది హాజరైన కార్యక్రమం.. ఎక్కడా చిన్నపాటి తప్పిదం కూడా చోటుచేసుకోకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముగియడం గర్వకారణమని పార్టీ నేతలు చెబుతున్నారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తం

- ఉమ్మడి జిల్లాలో 158 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల ఏర్పాటు



బర్డ్ ఫ్లూ లక్షణాలతో పడిపోయిన కోళ్లు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: ప్రమాదకర బర్డ్ ఫ్లూపై అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో ఇప్పటివరకూ ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదు కాకున్నా.. భవిష్యత్తులో వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ జేడీలు డాక్టర్ వై.సుబ్రమణ్యం, డాక్టర్ బి. శుభదాస్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రామచంద్ర తెలిపారు. కోళ్లు, బాతులు, నీటి పక్షులు, టర్కీ కోళ్లు, కొంగలు, గిన్ని కోళ్లు, కౌజు పిట్టలు, నెమళ్లు, విదేశీ పక్షుల ద్వారా బర్డ్ ఫ్లూ వ్యాపిస్తుందన్నారు. ఇది కోళ్లకు వ్యాపించే వైరస్ అన్నారు. మనుషులకు కూడా సోకే ప్రమాదం ఉంటుందన్నారు. కోళ్లలో అకస్మాత్తుగా మరణాలు, కళ్లు, తల, మెడ దగ్గర వాపు రావడం, ముక్కు నుంచి ద్రవాలు కారడం, గుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడం, అకస్మాత్తుగా మెత్తబడటం, కాళ్లు ఎర్రగా మారడం లాంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు.కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే అధికారులను సంప్రదించాలని సూచించారు.

158 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు

బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్మూలనలో భాగంగా జిల్లాలో 80, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 78 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 392 స్వాబ్ నమూనాలు, 260 రక్త నమూనాలు సేకరించి విజయవాడ పరీక్షా కేంద్రానికి పంపామన్నారు. అలాగే చిలమత్తూరు మండలం ఎస్.వీరాపురంలో విదేశీ పక్షుల నుంచి నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. జిల్లాలో 3.67 లక్షల బ్రాయిలర్ కోళ్లు, 1.76 లక్షల పెరటి కోళ్లు ఉండగా, శ్రీ సత్యసాయి జిల్లాలో 4.46 లక్షల బాయిలర్, 2.64 లక్షల పెరటి కోళ్లు ఉన్నట్లు వారు తెలిపారు.

పక్కాగా నిబంధనల అమలు

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం
- ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమావేశం

అనంతపురం అర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డితో కలిసి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌ఓ), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో (ఏఈఆర్‌ఓ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉంటూ బృందంగా పనిచేయాలన్నారు. నివేదికలను పరిశీలించి సకాలంలో పంపించాలని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లలో పనులు పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు, నామినేషన్లు, సీ-విజిల్, ఐటీ, తదితర అని టీమ్‌లను నియమించాలని ఆదేశించారు. కొత్తగా వచ్చిన రిటర్నింగ్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని చెప్పారు. 1,500 ఓటర్లు దాటిన చోట అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. పెండింగ్ క్లెయిములను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వారు ఇంటి నుంచే ఓటు వేసే విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. దివ్యాంగ ఓటర్లకు సంబంధించి మార్కింగ్ ప్రక్రియ పూర్తిస్థాయిలో చేపట్టాలని సూచించారు. ఆర్‌ఓలు హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించిన మార్గదర్శకాలు, నిబంధనలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు.



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి

సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

అనంతపురం అర్బన్: ''స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో ప్రజల నుంచి అందే అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి.'' అని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, వరప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి 254 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీల పరిష్కార క్రమంలో ఏ దశలోనూ నిర్లక్ష్యం చూపకూడదన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. తమ శాఖ సిబ్బందితో రోజూ సమీక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీపీఓ ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రబీ @ 2.12 లక్షల ఎకరాలు

- ముగిసిన ఈ-క్రాప్, ఈ కేవైసీ
- కణేకల్లు మండలంలో అత్యధికంగా సాగు
- ప్రభుత్వానికి చేరిన నివేదిక

అనంతపురం అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా 'రబీ' సీజన్‌లో సాగు చేసిన పంటల ఈ-క్రాప్, ఈ కేవైసీ ప్రక్రియ ముగిసింది. నివేదికను రాష్ట్ర కమిషనరేట్ కార్యాలయానికి రెండు రోజుల క్రితం జిల్లాధికారులు పంపారు. 31 మండలాల పరిధిలో నల్లరేగడి భూములు కలిగిన ప్రాంతాల్లో సాగు ఎక్కువగా ఉంది. ఈ రబీలో వ్యవసాయ, ఉద్యాన పంటలు 3.30 లక్షల ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేయగా.. 2.02 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 10 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు వెరసి 2.12 లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు వెల్లడైంది. 55,475 మంది రైతులు పంటలు పెట్టారు. అధికారులు గడువులోపు 99 శాతం ఈకేవైసీ ప్రక్రియ, 100 శాతం వీఆర్‌ఓల అథెంటికేషన్ పూర్తి చేశారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావం లేకపోవడంతో పంటల విస్తీర్ణం తగ్గింది.

కణేకల్లులో అత్యధికంగా..

జిల్లాలోనే కణేకల్లు మండలంలో అత్యధిక విస్తీర్ణంలో రబీ పంటలు సాగులోకి వచ్చాయి. మండల పరిధిలో 4,699 మంది రైతులు 24,398 ఎకరాల్లో పంటలు వేశారు. అందులో వ్యవసాయ పంటలు 23,919, ఉద్యాన పంటలు 478 ఎకరాల్లో సాగు చేశారు. ఆ తర్వాత ఉరవకొండ మండలంలో 4,699 మంది రైతులు 23,237 ఎకరాల్లో, విడపనకల్లు మండలంలో 4,671 మంది రైతులు 19,035 ఎకరాల్లో, బెళుగుప్ప మండలంలో 3,680 మంది రైతులు 17,817 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు తేలింది. ఈ మండలాల తరువాత వరుసగా వజ్రకరూరు, తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, కళ్యాణదుర్గం, బొమ్మనహాళ్, ఆత్మకూరు, శింగనమల, యల్లనూరు, పుట్లూరు మండలాలు నిలిచాయి. రాప్తాడు, గుంతకల్లు, కంబదూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి, అనంతపురం, గుమ్మఘట్ట, శెట్టూరు మండలాల్లో చాలా తక్కువగా ఉండగా, మిగతా మండలాల్లో మోస్తరుగా ఈ-క్రాప్‌లో పంటలు నమోదు చేశారు. ప్రధాన పంట అయిన పప్పుశనగను ఎక్కువ మంది సాగు చేశారు. వేరుశనగ, మొక్కజొన్న, వరి తదితర పంటలు నామమాత్రంగా సాగులోకి వచ్చినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ-క్రాప్‌తో పాటు వర్షపాతం, దిగుబడుల అంచనాల వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు వెల్లడించారు.



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ (ఫైల్)

మార్కెట్‌ను ముంచెత్తుతున్న పట్టుగూళ్లు



మార్కెట్‌కు వచ్చిన బైవోల్టిన్ పట్టుగూళ్లు

హిందూపురం అర్బన్: పట్టుగూళ్లు హిందూపురం మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని మార్కెట్లతో పోలిస్తే ధరలు బాగా పలుకుతుండటంతో రైతులు 'పురం' మార్కెట్‌వైపు మొగ్గు చూపుతున్నారు. కర్ణాటక, ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచే కాకుండా కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి పట్టుగూళ్లు వస్తున్నాయి. సోమవారం 8.5 టన్నులకుపైగా పట్టుగూళ్లు వచ్చాయి. రోజూ సగటున 3 టన్నుల నుంచి 5 టన్నుల వరకూ పట్టుగూళ్లు వస్తున్నాయి. మార్కెట్‌కు వస్తున్న పట్టుగూళ్లలో 60 శాతం గూళ్లు మడకశిర నియోజకవర్గం, కర్ణాటక నుంచి వస్తున్నాయి. సోమవారం కిలో బైవోల్టిన్ గూళ్లు రూ.460 నుంచి రూ.520 వరకూ ధరలు పలికాయి. ఈనెల 9వ తేదీన 3,480 కిలోల పట్టుగూళ్లు మార్కెట్‌కు రాగా గరిష్టం రూ.537, కనిష్టంగా రూ.265 ప్రకారం ధర పలికాయి. అలాగే 13వ తేదీన 3,133 కిలోల పట్టుగూళ్లు మార్కెట్‌కు రాగా గరిష్టం రూ.526, కనిష్టంగా రూ.310, 16వ తేదీన 5,803 కిలోల పట్టుగూళ్లు మార్కెట్‌కు రాగా గరిష్టం రూ.539, కనిష్టంగా రూ.360, 18 వ తేదీన 8,358 కిలోల పట్టుగూళ్లు మార్కెట్‌కు రాగా గరిష్టం రూ.512, కనిష్టంగా రూ.382 ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిరెడ్డి తెలిపారు.

జగనన్న సందేశం ప్రజల్లోకి తీసుకెళ్దాం

- 'సిద్ధం' విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో సీఎం జగనన్న ఇచ్చిన సందేశాన్ని సమష్టిగా ప్రజల్లోకి తీసుకెళదామని పార్టీ శ్రేణులకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ స్థాయి 'సిద్ధం' సభను రాప్తాడులో నిర్వహించేందుకు అనుమతిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సిద్ధం సభకు వచ్చిన కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ తానై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఈ తరహా ఎన్నికల సభను దేశ రాజకీయ చరిత్రలో ఏ పార్టీ ఎన్నడూ నిర్వహించలేదన్నారు. సిద్ధం సభ నిర్వహణకు స్థలాన్ని కేటాయించిన దాతలకు, జన సునామీలా తరలివచ్చిన జగనన్న సైనికులకు, సభా ప్రాంగణాన్ని జనసంద్రంగా మార్చిన రాయలసీమ బిడ్డలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పెత్తందారులతో పోరాడే క్రమంలో జగన్ వెంటే తాము ఉండేందుకు సిద్ధమని ఈ సభ ద్వారా కార్యకర్తలు నినదించారన్నారు. ఐదేళ్లలో పేదలకు చేసిన ప్రతి మంచి పనిపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా నాయకులు, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, జెడ్పీ చైర్మన్లు, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్లు, ఇతర ప్రతినిధుల అందరికీ పేరుపేరునా రాప్తాడు నియోజకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు ఎంపీలు, 14 ఎమ్మెల్యే స్థానాలు గెలవబోతున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికలకు స్వేచ్ఛ ఉంటుందని, వారు రాసే విషయాల్లో ఏవైనా అవాస్తవాలు, బాధ కలిగించే అంశాలున్నప్పుడు దానిపై స్పష్టత ఇవ్వాల్సిన స్వేచ్ఛ మనకూ ఉంటుందన్నారు. అంతేకాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. రాప్తాడులో ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండించారు. బాధితుడికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టులకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయయాదవ్, రాప్తాడు వైస్‌ఎంపీపీ రామాంజనేయులు, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీకి కునుకు దూరం చేసిన 'సిద్ధం'

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా


మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభ టీడీపీ నాయకులకు కంటి మీద కునుకు లేకుండా చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. స్థానిక గన్నెవారిపల్లి కాలనీలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా సీఎం వైఎస్ జగన్ ప్రసంగం కొనసాగిందన్నారు. ఈ సభను చూసిన టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగుతీశాయన్నారు. దేశ రాజకీయాల్లోనే రాప్తాడు సిద్ధం సభ ఓ మైలు రాయిగా చిరస్థాయిగా నిలుస్తోందన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక న్యాయాన్ని పాటించడమే సభ విజయవంతానికి కారణమన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారనేందుకు ఈ సభనే నిదర్శనమన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాబోవు ఎన్నికల్లో టీడీపీ కూటమికి డిపాజిట్లు కూడా దక్కవన్నారు.

పాడి రైతులకు మంచి రోజులు

- జగనన్న పాలవెల్లువతో పెరగనున్న ధరలు
- అన్‌లైజర్లకు లైసెన్సులు తప్పనిసరి
- మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరించనున్న పశువైద్యాధికారులు
- పాల నాణ్యతను బట్టి పాడి రైతులకు గిట్టుబాటు ధర





అనంతపురం అగ్రికల్చర్: పాడి రైతులకు మంచి రోజులు వస్తున్నాయి. పాడి రైతులకు దన్నుగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. పాడి పశువులు, గేదెల పోషణ ద్వారా జీవనం సాగిస్తున్న వారికి మంచి ధర చెల్లించేందుకు జగన్ సర్కార్ నిర్ణయం తీసుకుంది.

ప్రైవేట్ డెయిరీల దోపిడీకి చెక్

అమూల్ లాంటి అంతర్జాతీయ పాడి సహకార సంస్థతో జగన్ సర్కార్ చేసుకున్న ఒప్పందం తర్వాత ప్రైవేట్ డెయిరీలో దోపిడీకి చెక్ పడింది. గత కొన్నేళ్లుగా ప్రైవేట్ డెయిరీలు చెప్పిందే ధరగా కొనసాగుతూ వచ్చింది. ఇష్టారాజ్యంగా పాడి రైతులను మోసం చేస్తూ తక్కువ ధరకే పాలను కొనుగోలు చేస్తూ వచ్చారు. అమూల్ ప్రవేశంతో ప్రైవేట్ డెయిరీల నిర్వాహకులు సైతం ధరలు పెంచకతప్పలేదు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా జగన్ సర్కార్ తమకెంతో మేలు చేసిందని పాడి రైతులు అంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండేళ్లుగా జగనన్న పాల వెల్లువ విజయవంతంగా అమలవుతోంది. తాజా అనంతపురం జిల్లా పరిధిలో నాలుగైదు రోజుల్లో పాల సేకరణ ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఐదు మండలాల్లోని 98 గ్రామాల్లో 55 ఆర్‌బీకేల ద్వారా పాల సేకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

రైతుల సంక్షేమం కోసమే మిల్క్ యాక్ట్

తాజాగా రైతుల సంక్షేమం కోసం పాల రక్షిత ప్రమాణముల అమలు చట్టాన్ని (మిల్క్‌యాక్ట్) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనిపై పశుసంవర్ధకశాఖ అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. చాలా కేంద్రాల్లో మిల్క్ అనలైజర్లు ఉన్నా అందులో మోసం చేయడానికి అవకాశం ఉందని గుర్తించారు. దీంతో పాడి రైతులకు సరైన ధర లభించడం లేదనే వాదనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా ఇకపై మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా పశువైద్యులు (వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్–వీఏఎస్) వ్యవహరించనున్నారు. చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయడంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పాల సేకరణ కేంద్రాలు (మిల్క్ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లు) తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలి. అనంతరం వీటిని ఏటా రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మిల్క్ అనలైజర్ మిషన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ రూ.1,500 చెల్లించి లైసెన్సు తీసుకుని కేంద్రాల్లో డిస్‌ప్లే చేయాలంటూ స్పష్టమైన ఆదేశాలూ జారీ అయ్యాయి. తనిఖీ సమయంలో లైసెన్సు లేకుంటే మొదటి దఫా కింద రూ.50 వేలు జరిమానా విధిస్తారు. రెండో సారి పట్టుబడితే రూ.లక్ష జరిమానా, ఆరు నెలల వరకు జైలు శిక్ష పడే అవకాశముంది. మిల్క్ ఇన్‌స్పెక్టర్లు తరచూ పాల సేకరణ కేంద్రాలను తనిఖీ చేసి అనలైజర్లు కచ్చితత్వంతో పనిచేస్తున్నాయా లేదా అనేది చూడాల్సి ఉంటుంది.

నాణ్యతను బట్టి ధర

పాల నాణ్యతను బట్టి అంటే కొవ్వుశాతం (ఫ్యాట్), ఘన పదార్థం (ఎస్‌ఎన్‌ఎఫ్) ఆధారంగా గేదె పాలు లీటర్‌కు రూ.45 నుంచి రూ. 87 వరకు, ఆవు పాలకు రూ.35 నుంచి రూ.45 వరకు ధర చెల్లిస్తారు. తర్వాత పాడి రైతులకు మంచి ధరతో పాటు వినియోగదారులకు నాణ్యమైన పాలు, వాటి ఉత్పత్తులను చేరువ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనలైజర్లను వాడుతున్న వారు విధిగా ఆర్‌బీకేలు, పశువుల ఆస్పత్రి వైద్యాధికారులను సంప్రదించి లైసెన్సులు పొందాలి.

– డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం సిటీ: మద్యానికి బానిసైన వ్యక్తి కుటుంబసభ్యులతో గొడవపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని రాణీనగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా (40) మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. భార్య రేష్మా, ఓ కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా తాగుడుకు బానిసైన అయన తరచూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే భార్యాపిల్లలను విచక్షణారహితంగా చితకబాదేవాడు. శనివారం ఉదయం ఇంట్లో గొడవ పడి బయటకు వచ్చేసిన మహబూబ్‌బాషా సోమవారం ఉదయం అనంతపురం రైల్వే స్టేషన్‌కు సమీపంలోని హెచ్చెల్సీ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కలెక్టరేట్ ఏఓగా అంజన్‌బాబు

అనంతపురం అర్బన్: కలెక్టరేట్ పరిపాలనాధికారిగా తహసీల్దారు అంజన్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ కె.శ్రీధర్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో కర్నూలు జిల్లాలో తహసీల్దార్‌గా పని చేస్తున్న అంజన్‌బాబును ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లాకు బదిలీ చేయడగా, ఆయనను కలెక్టరేట్ ఏఓగా నియమిస్తూ కలెక్టర్ ఎం.గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సోమవారం ఆయన విధుల్లోకి చేరారు.

పొట్టి శ్రీరాములు త్యాగం స్ఫూర్తిదాయకం

• పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి





విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: ఆంధ్రప్రదేశ్ ఏర్పాటులో పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం స్ఫూర్తిదాయకమని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి కొనియాడారు. సోమవారం అనంతపురంలోని పాతూరు కన్యకాపరమేశ్వరి కల్యాణమంటపంలో ఆర్య వైశ్య సంఘం 70 వసంతాల ఉత్సవం, అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహావిష్కరణను ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పొట్టి శ్రీరాములు పోరాట పటిమను గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ విడిపోవడంతో నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపకూడదని ఎంతో మంది అంటున్నా... సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగానికి గుర్తుగా నవంబర్ 1న ఏపీ అవతరణ దినోత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకుని అనంతపురంలోని ఆర్యవైశ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఆర్యవైశ్యుల్లో జన్మించిన మహాత్మగాంధీ, పొట్టి శ్రీరాములు, రోశయ్య... ప్రజలకు చేసిన సేవలు ఎన్నటికీ మరిచిపోలేనివన్నారు. అలాంటి గొప్పవారి విగ్రహాలు ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకమన్నారు. హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షుడు తిరువీధుల జగదీష్ మాట్లాడుతూ.. నగరంలోని మూడు ప్రధాన కూడళ్లల్లో ఆర్యవైశ్యుల పెద్దల విగ్రహాలు ఏర్పాటు చేసి, ఆయా సర్కిళ్లకు వారి పేరు పెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఐరన్ బ్రిడ్జి సమీపంలోని విజయక్లాత్ సెంటర్‌గా పిలవబడే సర్కిల్‌ను ఇకపై పొట్టి శ్రీరాములు సర్కిల్‌గా నామకరణం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సిరుగుప్ప వెంకటేశ్వర్లు, పాతూరు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, ఆర్య వైశ్య సంఘం మహాసభ యువజన సంఘం అధ్యక్షుడు శబరీష్, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ సత్రసాల మంజునాథ్, పాతూరు విరుపాక్షేశ్వర ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సతీష్, వైశ్య హాస్టల్ అధ్యక్షుడు ఆదిశేషయ్య, పాతూరు ఆర్య వైశ్య సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు చల్లా స్వర్ణలత, కార్పొరేటర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేయండి

• జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



నియామకపత్రాలు అందుకున్న వారితో జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ నిదియాదేవి, డిప్యూటీ సీఈఓ లలితాబాయి

అనంతపురం సిటీ: ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఉమ్మడి జిల్లాలో జెడ్పీ, అనుబంధ విభాగాల్లో పని చేస్తూ మరణించిన 17 మంది ఉద్యోగులకు సంబంధించి వారి వారసులకు కారుణ్య నియామకాల కింద టైపిస్టులుగా ఉద్యోగావకాశం కల్పించారు. ఎంపికైన వారికి జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, డిప్యూటీ సీఈఓ లలితాబాయి, జెడ్పీ ఉద్యోగ సంఘం ప్రతినిధి నాగేంద్రకుమార్‌తో కలసి సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో ఆమె నియామక పత్రాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు దక్కాయన్నారు. నియామక పత్రాలు అందుకున్న వారందరికీ సీఈఓ నిదియాదేవి శుభాకాంక్షలు తెలిపారు.

యువకుడిని కాపాడిన పోలీసులు


ప్రవీణ్‌రెడ్డిని కాపాడి తీసుకువస్తున్న పోలీసులు

సోమందేపల్లి: ఆత్మహత్యకు సిద్ధపడిన యువకుడిని పోలీసులు సకాలంలో గుర్తించి కాపాడారు. వివరాలు... సోమందేపల్లిలోని గీతానగర్‌కు చెందిన ప్రవీణ్‌రెడ్డి... డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆయన సోమవారం రాత్రి చాకర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద పట్టాలపై పడుకుని తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వాట్సాప్ ద్వారా కుటుంబసభ్యులతో మాట్లాడాడు. కుటుంబసభ్యులు వెంటనే డయల్ 100కు సమాచారం అందజేయడంతో విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విజయ్ కుమార్ వెంటనే స్పందించి కానిస్టేబుళ్లను అక్కడకు పంపారు. అప్పటికే రైలు వస్తుండడం గమనించిన వారు పట్టాలపై పడుకుని ఉన్న ప్రవీణ్‌రెడ్డిని పక్కకు లాగి ప్రాణాలు కాపాడి స్టేషన్‌కు తరలించారు. కౌన్సెలింగ్ అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి


వెన్నెల (ఫైల్)

చిలమత్తూరు: కర్ణాటకలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరులో నివాసముంటున్న చిలమత్తూరు మండలం పాతచామలపల్లికి చెందిన వెన్నెల (35) తన ఐదేళ్ల వయసున్న కుమార్తెతో కలసి ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. పెళ్లి వేడుకలో పాల్గొన్న ఆమె సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు టాటా సఫారీ వాహనంలో బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. కర్ణాటకలోని బాగేపల్లి సమీపంలో చేరుకోగానే గ్రీన్‌పార్క్ ధాబా వద్ద 44వ జాతీయ రహదారికి వెళ్లే మలుపులో వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొనడంతో వెన్నల అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నారి తీవ్రంగా గాయపడింది. మరో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న బాగేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

సింహ వాహనంపై శ్రీవారు


సింహవాహనంపై ఊరేగుతున్న బొలికొండ రంగనాథస్వామి

గుత్తి రూరల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు దేవేరులతో కలసి భక్తులకు సింహ వాహనంపై బొలికొండ రంగనాథస్వామి దర్శనమిచ్చారు. గుత్తి మండలం తొండపాడులోని బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో వేకువజాము నుంచే అర్చకులు పలుకూరి రవికుమార్, చేతన్‌వర్మ, లిఖిల్‌వర్మ, నవీన్‌కుమార్ విశేష పూజలు నిర్వహించారు. రాత్రి సింహ వాహనంపై విహరిస్తున్న శ్రీవారిని దర్శించుకుని భక్తులు ఆనంద పరవశులయ్యారు. కాగా, తిరునాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భారీగా దుకాణాలు వెలిసాయి. ఈఓ దేవదాసు, సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

చింతపండు @ రూ.22 వేలు


మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.22 వేలు పలికింది. మార్కెట్‌కు సోమవారం 3 వేల క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.8,200, సగటున రూ.14 వేల ప్రకారం ధర పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.6 వేలు, కనిష్టంగా రూ.4,100, సగటున రూ.8 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 44 మంది ఎంపిక


క్యాంపస్ ఇంటర్వ్యూల్లో భాగంగా రాత పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కాయి. ఈ నెల 16 నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఆస్ట్రాజెన్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలకు 54 మంది అభ్యర్థులు హాజరు కాగా, 22 మంది ఎంపికయ్యారు. అలాగే డేటా మార్షల్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 82 మంది పాల్గొనగా 22 మందికి ఉద్యోగాలు దక్కాయి. ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులను ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ప్రొఫెసర్ ఎస్.ఏ కోరి అభినందించారు.

'పోలీస్ స్పందన'కు 119 వినతులు


సమస్యపై ఆరా తీస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 119 వినతులు అందాయి. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ స్వయంగా వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో మాట్లాడి, సమస్య వివరించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా పోలీసు స్పందన విభాగం 9392926803కు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఎం.ఆంథోనప్ప, ఎస్బీ సీఐ ఇందిర పాల్గొన్నారు.

దాడి చేసిన వారి మీద కేసు నమోదు : ఎస్పీ

అనంతపురం: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై కేసు నమోదైంది. ఈ మేరకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పోలీసుల నిర్లక్ష్యం ఉందన్న ఆరోపణలపై అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారితో విచారణ చేయిస్తున్నట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే సంబంధీకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉరవకొండలో పత్రికా విలేకరులపై జరిగిన దాడి మీద కూడా వెంటనే చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఘటనలో 15 మందిని అరెస్ట్ చేసి బైండోవర్ చేసినట్లు తెలిపారు. పత్రికా విలేకరుల రక్షణ పోలీసుల బాధ్యత అన్నారు. వారు స్వేచ్ఛగా విధులు నిర్వహించుకునేందుకు కచ్చితంగా సహకరిస్తామన్నారు. విలేకరులపై ఎవరైనా దాడులు చేసే అవకాశమున్నా, బెదిరించిన వెంటనే సమాచారం అందజేయాలన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తాం

• ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి


వినతిపత్రం అందుకుంటున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం ఎస్కేయూ, జేఎన్‌టీయూ(ఏ)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా వర్సిటీల్లోని బోధనేతర సిబ్బంది, ఉద్యోగులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన ఆయన ఆయా వర్సిటీల వైస్‌చాన్సలర్లు, రిజిస్ట్రార్లతో కలిసి చర్చించారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మిని కలసి మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యాయ జేఏసీ నాయకులు అశోక్‌కుమార్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవిందరెడ్డి, రవీంద్రారెడ్డి, తిమ్మారెడ్డి, జగన్, రవి, కృష్ణారెడ్డి, నాగేంద్ర గౌడ్, 'అపుస్మా' నాయకులు కుసుమ పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, మధు ఉన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర కమిటీలో ఇద్దరికి చోటు


సూర్యుడు


చంద్రశేఖర్

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. రెండు రోజుల కిందట పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఎస్టీయూ 77వ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా అనంతపురం జిల్లాకు చెందిన ఎ. సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శిగా ఓ. చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. వీరి ఎంపికపై ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, ఫైనాన్స్ కార్యదర్శి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

ఏపీ ప్రకృతి వ్యవసాయంపై ప్రశంసలు


స్విట్జర్లాండ్‌లో విదేశీ శాస్త్రవేత్తల బృందంతో డీపీఎం లక్ష్మానాయక్

అనంతపురం అగ్రికల్చర్: ఏపీ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై విదేశీ శాస్త్రవేత్తల నుంచి ప్రశంసలు వ్యక్తమయ్యాయని ఏపీ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్‌ఎఫ్) జిల్లా డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ (డీపీఎం) లక్ష్మానాయక్ అన్నారు. ఈ నెల 13 నుంచి విదేశీ పర్యటనలో భాగంగా చివరి రోజు సోమవారం ఆయన స్విట్జర్లాండ్ నుంచి 'సాక్షి'తో మాట్లాడారు. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆర్గనైజింగ్ ఫార్మింగ్ సదస్సులో విదేశాలకు చెందిన పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం గురించి ప్రశంసలు గుప్పించారన్నారు. పరిశోధనలు, మెలకువలకు ఏపీ అనువైన ప్రాంతమని వారు గుర్తించినట్లు తెలిపారు. త్వరలోనే వివిధ దేశాల ప్రతినిధులు ఏపీ, అనంతపురం పర్యటనకు వచ్చే అవకాశం ఉందన్నారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న సైన్స్‌ఫేర్


నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రామగిరి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని టింబక్ట్ కలెక్టివ్, చిగురు సంస్థ ఆధ్వర్యంలో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది విద్యార్థులు 43 రకరకాల నమూనాలను ప్రదర్శించారు. అనంతరం సంస్థ సిబ్బంది మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని చిన్నారులకు సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు సైన్స్‌ఫేర్ నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీయొచ్చన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రామన్న, సిబ్బంది కల్పన, ఆనంద్, ఆడవి రాముడు ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు


సిలిండర్లను జప్తు చేసిన విజిలెన్స్ అధికారులు

అనంతపురం: ఇంటికి వినియోగించాల్సిన గ్యాస్ సిలెండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం, చట్ట విరుద్ధంగా వ్యాపారం చేయడాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. అనంతపురం ప్రాంతీయ నిఘా మరియు అమలు అధికారి ఎస్.మాసూమ్ బాషా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మొత్తం 10 డొమెస్టిక్ సిలిండర్లను జప్తు చేశారు. పోలేరమ్మ తల్లి ఫ్యామిలీ గార్డెన్ అండ్ రెస్టారెంట్ (ఆర్డీటీ స్టేడియం ఎదురుగా, పంగల్ రోడ్డు, అనంతపురం)లో నాలుగు డొమెస్టిక్ సిలెండర్లు , గంగాదేవి హోటల్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్, ఎస్వీ సినిమా థియేటర్ పక్కన, అనంతపురంలో ఆరు డొమెస్టిక్ సిలిండర్లను జప్తు చేశారు. కార్యక్రమంలో సీఐ వెంకటరమణ, ఎస్ఐ శేషగిరి, ఏఓ వాసు ప్రకాష్, ఏఈఈ రవీంద్రనాథ్, సీఎస్డీటీ ఎస్. మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దుబ్బార్లపల్లిలో వ్యవసాయ పరికరాల చోరీ

రామగిరి: మండలంలోని దుబ్బార్లపల్లిలో ఆదివారం రాత్రి ముగ్గురు రైతులకు చెందిన వ్యవసాయ పరికరాలు చోరీకి గురయ్యాయి. రైతు సుబ్బయ్యకు చెందిన రెండు స్టార్టర్లు, వార్డ్ మెంబర్ పెద్దయ్యకు చెందిన కేబుల్, స్ప్రింకర్‌గన్లు, స్టార్టర్లు, ఎర్రప్పకు సంబంధించిన స్టార్టర్ బాక్సులను గుర్తు తెలియని ఎత్తుకెళ్లారు. రూ.లక్ష విలువైన పరికరాలు చోరీకి గురైనట్లు బాధిత రైతులు తెలిపారు. సోమవారం రామగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనంత బాలోత్సవంలో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం మధుసుదన్‌రావు

గుంతకల్లు: పట్టణంలోని రైల్వే ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు అనంత బాలోత్సవంలో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మధుసుదన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం హైస్కూల్‌లో అభినందన సభకు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12,13,14వ తేదీల్లో అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన అనంత బాలోత్సవంలో తమ స్కూల్‌కు చెందిన దాదాపు 84మంది 24 ఈవెంట్లులో పాల్గొనగా 14 ఈవెంట్లలో ప్రతిభ కనబరిచి 14 బహుమతులను గెలుచుకున్నారన్నారు. అందులో 4 మొదటి బహుమతులు, 2 రెండో బహుతులు, 5 మూడో బహుతులతోపాటు 3 కన్సొలేషన్ బహుమతులున్నాయన్నారు.

గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రఘునాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 21వ తేదీల్లో తోపుదుర్తి, ఆత్మకూరు-1, ఈనెల 22, 23 తేదీల్లో సనప, రంగంపేట, పి.యాలేరు, సిద్దరాంపురం సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు. ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అయోధ్యకు రామ భక్తులు


అయోధ్యకు వెళుతున్న భక్తులు

గుత్తి: అయోధ్యలో బాల రాముని దర్శనం కోసం జిల్లా నుంచి 195 మంది రామ భక్తులు గుత్తి రైల్వే స్టేషన్ నుంచి ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో రైల్లో బయలుదేరారు. విజయవాడ నుంచి అయోధ్యకు వేసిన స్పెషల్ ట్రైన్‌లో రామ భక్తులందరూ తరలివెళ్లారు. ఈ సందర్భంగా రైల్వే సీఐ హనూక్ కుమార్, ఎస్ఎంఆర్ సురేష్, ఐపీఎఫ్ అనురాగ్ శర్మ తదితరులు భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. అనంతరం రైల్వే అధికారులు భక్తులను రైలు ఎక్కించి వీడ్కోలు పలికారు.

నీటిని పొదుపుగా వాడుకోండి

- మేయర్ వసీం


29వ డివిజన్ ప్రజలకు సూచనలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలని మేయర్ వసీం నగర ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం 29, 30 డివిజన్లలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇటీవల మోటర్లు కాలిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తినట్లు పేర్కొన్నారు. నగర ప్రజలకు తగిన మోతాదులో పూర్తి స్థాయిలో నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శుద్ధ జలం అందించేందుకు నీటి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నీటి పంపిణీ, శుద్ధతపై ఎటువంటి అపోహలు వద్దన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు కూడా నీటి వినియోగం తగ్గించుకోవాలన్నారు. నీటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రతి ఒక్కరికి బాధ్యత ఉందన్నారు. ముఖ్యంగా మహిళలు నీటి సంరక్షణలో భాగస్వామ్యులు కావాలన్నారు. అవసరం మేరకు నీటిని పొదుపుగా వాడుకుంటే వేసవిలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నా కూడా ఇబ్బంది ఉండదని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అనిల్ కుమార్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ రెడ్డి, డీఈ సుభాష్, ఏఈ విజయ్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ స్థితికి నీటి సరఫరా

- నగరపాలక సంస్థ ఎస్ఈ రామమోహన్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో నగరంలో నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు నగరపాలక సంస్థ ఎస్ఈ రామమోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పాతూరు, శ్రీనగర్ కాలనీల్లో జరుగుతున్న నీటి సరఫరాను ఎస్ఈ పర్యవేక్షించారు. నీటి సరఫరా, క్లోరినేషన్ పరీక్షల్లో ఎటువంటి జాప్యం జరగకూడదని ట్యాప్ ఇన్‌స్పెక్టర్, ఫిట్టర్లను తదితరులను ఆదేశించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ.. నగరంలో 48 (ఎంఎల్‌డీ) మిలియన్ లీటర్ పర్ డే సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పీఏబీఆర్ డ్యాంలో ప్రస్తుతం రెండు మోటర్లకు మరమ్మతులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మూడో మోటర్‌కు మరో 15 రోజుల్లో మరమ్మత్తు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా రానున్న రోజుల్లో పాలకవర్గం అనుమతితో మరో మోటర్‌ను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఎస్ఈ వెంట ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్ తదితరులున్నారు.

ఆర్టీసీ స్థలం కబ్జా చేస్తే ఊరుకోం

- ఆర్టీసీ రాయలసీమ రీజినల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల


మాట్లాడుతున్న రీజినల్ ఛైర్‌పర్సన్ మంజుల

అనంతపురం క్రైం: ఆర్టీసీ స్థలాన్ని కొంత మంది కబ్జా చేశారంటూ రాయలసీమ రీజినల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజులకు నారయణరెడ్డి అనే వ్యక్తి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. సోమవారం కబ్జాకు గురైందన్న స్థలాన్ని మంజుల పరిశీలించారు. కోట్లు విలువైన స్థలాలను కొంత మంది కాజేయాలని చాలా ఏళ్లుగా కుట్రలు చేస్తున్నట్లు గుర్తించారు. ఆర్టీసీ స్థలం మొత్తం 4 ఎకరాలుండాల్సిన చోట ఎకారానికి పైగా కబ్జాకు గురైనట్లు తెలుస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 120 సెంట్లు స్థలాన్ని నగర పాలిక అధికారులు కాలువల నిర్మాణానికి తీసుకున్నారు. ఆ స్థలానికి సంబంధించిన పరిహారం నేటికి చెల్లించలేదు. మిగిలిన స్థలంలోని సర్వేనంబరు 2071-1, 2069 ,2071-2 లెటర్ల మధ్య కొంత స్థలం కబ్జాకు గురైనట్లు తెలుస్తోందన్నారు. ఆర్టీసీ అధికారులు నిద్రమత్తు కారణంగా ఈ స్థలం కబ్జాకు గురవుతూ వచ్చిందన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ స్థలాన్ని ప్రభుత్వ సర్వేయర్లతో సర్వే చేయించి పక్కాగా హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆ దిశగా అధికారులతో కలసి సమీక్షిస్తామన్నారు. అదేవిదంగా నగర పాలక సంస్థ నుంచి ఆర్టీసీకి రావాల్సిన పరిహారాన్ని కూడా రాబట్టేందుకు కృషి చేస్తామన్నారు.

గుండె చికిత్సలకు ఆర్థికసాయం


సాయం అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: గుండె జబ్బుతో బాధపడుతున్న ఇద్దరికి అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. నగరంలోని 6వ రోడ్డులో నివసిస్తున్న జయమ్మ, ఓబులేసు దంపతులకు 8వ తరగతి చదువుతున్న పృథ్వీ, 6వ తరగతి చదువుతున్న సంతోష్ ఇద్దరు కొడుకులు ఉన్నారు. దురదృష్టవశాత్తూ చిన్నప్పటి నుంచే ఇద్దరికి గుండెల్లో రంధ్రం పడటంతో వైద్యం చేయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నాచితకా ఆస్పత్రుల్లో వైద్యం చేయించేందుకు ఉన్నదంతా ఖర్చు పెట్టుకున్నారు. అయినా ఫలితం లేకుండాపోయింది. చివరికి బెంగళూరులోని ఓ ఆస్పత్రికి వెళ్లగా.. వెంటనే ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఇందుకు రూ.6 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ తల్లిదండ్రులు అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు రమణారెడ్డిని ఆశ్రయించి తమ గోడు వెల్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన రమణారెడ్డి సోమవారం ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందజేశారు. అలాగే రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. భవిష్యత్తులో కూడా వీరి విద్య వైద్య ఖర్చులకు సాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు.

'స్పందన'కు 10 ఫిర్యాదులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 10 ఫిర్యాదులు వచ్చాయి. డిప్యూటీ కమిషనర్ వెంకటేష్‌కు ప్రజలు ఫిర్యాదులు అందజేశారు. రెవెన్యూ 2, ఇంజినీరింగ్ 7, టౌన్ ప్లానింగ్ 1 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. స్పందన సమస్యలను సకాలంలో నివృత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ హరిప్రసాద్, టీపీఓ శిరీష, ఈఈ సుధారాణి, సూపరింటెండెంట్‌లు విజయ్‌కుమార్, ఖయూం, సంధ్య, తదితరులు హాజరయ్యారు.

అభ్యుదయ కవితల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కవితా సంకలనం చేపట్టనున్నారు. ఇందు కోసం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉండే కవుల నుంచి అభ్యుదయ కవితలను ఆహ్వానిస్తున్నట్లు జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆధునిక దృక్పథంతో వచ్చే కవితలకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీలోపు కవులు తమ కవితలను 7702291125 వాట్సాప్ నంబర్‌కు పంపాలని సూచించారు.

ఈఈ మెరిట్ టెస్ట్‌లో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థికి ప్రోత్సాహకం అందిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతి, 7వ తరగతి విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈఈ మెరిట్ 2024 పరీక్షల్లో రాయదుర్గంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అనంతపురం జిల్లా నుంచి ప్రథమ స్థానంలో నిలిచి శభాష్ అనిపించారు. పట్టణంలోని ఆదర్శ పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎం.జిగ్నేష్ ప్రథమ స్థానం , చరిత ద్వితీయ స్థానంలో నిలిచారు. 7వ తరగతి విద్యార్థిని తనూజ జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. పదోతరగతి విద్యార్థి సాయి అమోఘ ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తోట వెంకటేశులు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతులకు కల్యాణం చేస్తున్న పండితులు


నూతన శివలింగాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: స్థానిక శివాలయంలో సోమవారం శివ మాలధారులు శివపార్వతుల కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి శివ పార్వతులను దర్శించుకున్నారు. అనంతరం శివపార్వతుల విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నూతనంగా తయారు చేయిం చిన శివలింగాన్ని గ్రామంలో ఊరేగించి ఆలయం వద్దకు చేర్చారు.

ప్రైవేటు బడుల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు

ఆత్మకూరు: 2024-25 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అభ్యసించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25 శాతం సీట్లను కేటాయించడం జరుగుతుందన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఈబీసీ, వికలాంగులు, అనాథ పిల్లలకు రిజర్వేషన్ ప్రకారం సీట్లను కేటాయిస్తారన్నారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ ప్రకారం ప్రైవేటు పాఠశాలలో కొంత మందికి ఉచిత విద్యను అందించాలన్న ఆలోచన చాలా మంచిదని తెలిపారు. అంతేకాకుండా ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థులను ప్రతి ఉపాధ్యాయులు, ఎంఈఓలు తప్పనిసరిగా దత్తత తీసుకుని బాగా చదివేలా చేయాలన్నారు. అంతేకాకుండా రాబోయే పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చొరవ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులపై వివక్ష వద్దు

బత్తలపల్లి: ప్రాణాంతక వ్యాధులబారిన పడిన వారి పట్ల వివక్ష చూపరాదని, సమాజంలో అందరూ కలసి జీవించాలని విహాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సతీష్‌కుమార్ సూచించారు. సోమవారం బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ప్రాణాంత వ్యాధులపై ప్రజలకు కళాజాతా రూపంలో అవగాహన కల్పించారు. కళాజాత బృందం సభ్యులు వెంకటేష్, తరిమెల రాజు, సరోజమ్మ, భీమలింగ, తిప్పేస్వామి, అంజి వీధి నాటకం, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రాణాంతక వ్యాధి, జాగ్రత్తల గురించి వివరించారు. విహాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు జయలక్ష్మి, సునీ, మంజునాథ, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటర్ పోస్టులకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ దశరాథరామయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ఆత్మకూరు సచివాలయం-2 పరిధిలో ఒకటి, ముట్టాలలో ఒకటి, రంగంపేట గ్రామంలో ఒకటి చొప్పున ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 28వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

నేడు 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 40వ డివిజన్‌లోని ఆజాద్‌నగర్‌లో మంగళవారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆజాద్ నగర్‌లోని కళ్యాణదుర్గం రోడ్డు నడిమివంక నుంచి కార్యక్రమం మొదలవుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్: పాలిసెట్ కోర్సుకు మంగళవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని బోరంపల్లి పాలటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ సోమవారం తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించి, ఏప్రిల్ 5వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రెండు కార్ల ఢీ: తప్పిన ప్రమాదం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలో ట్రాన్స్‌కో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. కర్ణాటకకు చెందిన కొందరు రెండు కార్లలో మంత్రాలయం బయలుదేరారు. ఆర్ఎస్‌లో ముందు వెళుతున్న ఇన్నావో కారును వెనుక నుంచి ఐ-20 కారు ఢీ కొంది. రెండు కార్లు డ్యామేజీ అయ్యాయి. ఎవరికీ గాయాలు కాలేదు.

సీఎం జగన్‌తోనే ముస్లింల సంక్షేమం


నడిమివంకలో మాబు సుబహాని జెండా కట్టను ప్రారంభించిన ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, చిత్రంలో మేయర్ వసీం, తదితరులు

- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం కల్చరల్: ముస్లింల సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఆజాద్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన గౌస్-ఏ-పాక్ (మాబు సుబహాని) జెండా కట్టను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం ప్రారంభించారు. చదివింపులు చేసి, జెండాలకు గంధం పూసి కట్టపైకి ఎక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో ముస్లింలను భాగస్వాములను చేస్తున్నామని గుర్తు చేశారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కరరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు ఇసాక్, సైఫుల్లా, బాబా, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత చంద్రారెడ్డి, గఫూర్, మహబూబ్‌ఖాన్, షరీఫ్, ఖాదర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 3న పల్స్ పోలియో


పల్స్ పోలియో పోస్టర్లను ఆవిష్కరించిన కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం కార్పొరేషన్: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ మేఘ స్వరూప్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ 2024కి సంబంధించిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. పల్స్ పోలియో నిర్వహణ పోస్టర్లను కమిషనర్ ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నిండు ప్రాణానికి రెండు చుక్కలని, ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు పంపిణీ చేయాలన్నారు. పిల్లలకు రక్షణ కల్పించడంలో ఎలాంటి తప్పులు చేయరాదన్నారు. పోలియోపై విజయం సాధించడంలో దేశానికి తోడ్పడాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ.. మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 5 ఏళ్లలోపు చిన్నారులు 2,79,980 మంది ఉన్నారని.. వీరందరికీ చుక్కల మందు వేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 32 మండలాల పరిధిలో 3.80 లక్షల డోస్‌ల పోలియో వ్యాక్సిన్ సరఫరా చేయడం జరిగిందన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలను అందించేలా తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలన్నారు. సమావేశంలో పీఓడీటీటీ డాక్టర్ సుజాత, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాద్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

72 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు


విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న మేయర్ వసీం, తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: సామాజిక సేవను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మేయర్ మహమ్మద్ వసీం కోరారు. సోమవారం నగరంలోని కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో మలబార్ గోల్డ్, డైమండ్ సంస్థ ఆధ్వర్యంలో 72 మంది పేద విద్యార్థులకు రూ.6.24 లక్షల స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ.. మలబార్ గోల్డ్, డైమండ్ సంస్థ వ్యాపార రంగంలోనే కాకుండా సేవా రంగంలో కూడా తనవంతు పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా ఇవ్వడం వల్ల మరింత ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడుతుందన్నారు. అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడమే కాకుండా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, అనిల్ కుమార్ రెడ్డి, కమల్ భూషణ్, డీవైఈఓ వెంకట రమణ, కళాశాలల ప్రిన్సిపాల్స్ నాగరత్నమ్మ, పద్మావతి, మలబార్ గోల్డ్ డైరెక్టర్ హఫీజ్ అహ్మద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరాటేలో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ


మెడల్స్ సాధించిన ధర్మవరం విద్యార్థులతో కరాటే మాస్టర్ ఇనాయత్ బాషా

ధర్మవరం అర్బన్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ చాటారని కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా తెలిపారు. బ్లాక్ బెల్ట్ కటా విభాగంలో ఇర్షాద్ సిల్వర్ మెడల్, కుమితే విభాగంలో సిల్వర్ మెడల్, అబూబకర్ సిల్వర్ మెడల్, బ్రాంచ్ మెడల్, కటా విభాగంలో ప్రణవ్ గోల్డ్ మెడల్, కుమితే విభాగంలో సిల్వర్ మెడల్, కటా విభాగంలో శర్విన్‌రెడ్డి గోల్డ్ మెడల్, కుమితే విభాగంలో సిల్వర్ మెడల్, కటా విభాగంలో అనీఫ్ సిల్వర్ మెడల్, కుమితే విభాగంలో బ్రాంచ్ మెడల్, కటాలో సాయిఈశ్వర్ బ్రాంచ్ మెడల్, కటా విభాగంలో మొహమ్మద్ ఆజాం సిల్వర్ మెడల్, కుమితే విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారని తెలిపారు. కరాటే డో ఇండియా ఛైర్మన్ సుమన్ తల్వార్ చేతులమీదుగా మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారని వెల్లడించారు. మొత్తం మూడు గోల్డ్‌మెడల్స్, ఐదు సిల్వర్ మెడల్స్, ఆరు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు.

విద్యార్థుల ఎంపికపై హర్షం


సాకే సాయికుమార్


చింతా నందిని

ధర్మవరం అర్బన్: జాతీయ సమైక్యత శిబిరానికి కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చింతా నందిని, సాకే సాయికుమార్ ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బెలగావిలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో ఈ నెల 20 నుంచి 26 వరకు కర్ణాటక ప్రభుత్వం యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో వీరు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపాల్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ త్రివేణి, అధ్యాపకులు షమీవుల్లా, చిట్టెమ్మ, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, పుష్పవతి, సౌజన్య, సరస్వతి, స్వామి, హేమావతి తదితరులు విద్యార్థులను అభినందించారు.